సాక్షి నిజామాబాద్

శనివారం। 20। జూలై। 2024



బషీరాబాద్‌లో బాధితులు

హుండీ వ్యాపారి చేతిలో మోసపోయిన గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యులు బషీరాబాద్ చుట్టూ తిరుగుతున్నారు.

- 8లో ▸



పునరావృతమైతే చర్యలు

తెయూ హాస్టల్ విద్యార్థుల భోజనంలో పురుగులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ యాదగిరి హెచ్చరించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.6 /23.7

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

సుభాష్‌నగర్: కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఇప్పటికే మున్సిపాలిటీలతో పాటు, మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చే వారికి సైతం ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని ఏర్పాటు చేశామని వివరించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆయ పథకాలు అందని అర్హులైన దరఖాస్తుదారులు ప్రజాపాలన సేవా కేంద్రాలను సందర్శించి సరి చేయించుకోవాలని సూచించారు. కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ ఉన్నారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



నందిపేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. మండలంలోని ఆంధ్రనగర్, షాపూర్, వన్నెల్(కే) గ్రామాలను శుక్రవారం ఆయన సందర్శించారు. నందిపేట ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆంధ్రానగర్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, పల్లె ప్రకృతి వనం పరిశీలించారు. శాపూర్‌లో సంపద వనాలను, వన్నెల్(కే)లో బృహత్ పల్లె ప్రకృతి వనం, ఆరోగ్య ఉపకేంద్రం, పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటే పనులను వేగవంతం చేయాలన్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ ఆనంద్, ఎంపీవో కిరణ్ కుమార్ ఉన్నారు.

డీఎంహెచ్‌వోగా రాజశ్రీ



నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా డాక్టర్ రాజశ్రీ రానున్నారు. చార్మినార్ జోన్‌లో సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి రానున్నారు. సుమారు ఎనిమిదేళ్లుగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా పూర్తిస్థాయి అధికారులు లేరు. సాధారణ బదిలీల్లో ఎట్టకేలకు పూర్తిస్థాయి అధికారి రానుండటంతో ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా రాజశ్రీ జిల్లాలోని భీమగల్ మండలానికి చెందిన వారు.

కొనసాగుతున్న బదిలీలు

వైద్యాశాఖలో బదిలీలు జరుగుతున్నాయి. సుమారు 30 మంది వరకు జిల్లా స్థాయిలలో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్ల బదిలీల జరిగాయి. మరోవైపు జీజీహెచ్‌లోని తొమ్మిది మంది అసోసియేట్ ప్రొఫెసర్‌లు ట్రాన్స్‌ఫర్ అయ్యారు.



అంకాపూర్‌లో మొక్కజొన్న మార్కెట్

మక్కెన్‌ల జాతర

అంకాపూర్ అంటే గుర్తొచ్చేది దేశీ చికెన్ ఒకటే కాదు.. పచ్చి మక్కబుట్టలకూ ఈ గ్రామం పెట్టింది పేరు.. వర్షాకాల సీజన్‌కు ముందుగానే మొక్కజొన్న పంట సాగు చేయడం ఈ గ్రామ రైతుల ఆనవాయితీ. ఇక్కడ పండించిన మక్క బుట్టలు పొరుగు జిల్లాలకే కాకుండా మహారాష్ట్రకు కూడా ఎగుమతి చేస్తారు. ఇక్కడి మక్క కంకులను తినేందుకు ఎంతోమంది ఆసక్తి చూపుతుండడం విశేషం.

- పచ్చిబుట్టకు పెరిగిన డిమాండ్
- ఆటోట్రాలీ కంకులకు రూ.10 వేలు చెల్లిస్తున్న వ్యాపారులు
- మహారాష్ట్రకు ఎగుమతులు..

ఆర్మూర్: నిజామాబాద్ నుంచి 63వ జాతీయ రహదారి మీదుగా ఆర్మూర్ వైపు వెళ్లే వాహనదారులు అంకాపూర్‌లో ఆగాల్సిందే.. నోరూరించే కాల్చిన మక్క కంకులను కొనుగోలు చేయడమే కాకుండా పచ్చిబుట్టలను తీసుకెళ్లాల్సిందే.. ఇదీ అంకాపూర్ పచ్చిబుట్టలకు ఉన్న డిమాండ్. ఆర్మూర్ మండలం అంకాపూర్ పచ్చి బుట్టల అమ్మకానికి ప్రసిద్ధి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న పండించే రైతులు పచ్చి బుట్టను అమ్మడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో అంకాపూర్ మార్కెట్‌లో పచ్చి మక్క బుట్ట ధర గణనీయంగా పెరిగింది. సీజన్ ప్రారంభంలో ఆటో ట్రాలీకి రూ.3 వేలు మాత్రమే పలికిన పచ్చి బుట్ట ప్రస్తుతం రూ.10 వేలకు చేరింది. దీంతో రైతుల నుంచి పంటను కొనుగోలు చేసిన బేరగాళ్లు డజన్ పచ్చి మక్కెన్‌లను రూ.60 నుంచి రూ.100 వరకు, కాల్చిన మక్కెన్ ఒక్కటి రూ.20కి అమ్ముతున్నారు. ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో రోహిణి కార్తెలో విత్తుకున్న మొక్కజొన్న (మక్కెన్) దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న అంకాపూర్ మక్కెన్‌ల మార్కెట్ ప్రారంభంలో కొనుగోలుదారులు లేక బోసిపోయింది. ప్రస్తుతం ధర పెరిగినప్పటికీ అమ్మకందారులు, కొనుగోలుదారులతో కళకళలాడుతోంది.



పచ్చిబుట్ట అమ్మకానికే మొగ్గు

జిల్లాలో మరిన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తుండగా, వర్షాలలో మొక్కజొన్న కంకులను ఎండబెట్టడం శ్రమతో కూడుకున్న పని కావడంతో పచ్చి బుట్ట అమ్మడానికే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఆర్మూర్ పట్టణం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే దారిలో 63వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఈ మార్కెట్ ఉండటంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఇక్కడ ఆగి మరీ రైతులు, దళారులు చెప్పిన ధరకే పచ్చిబుట్ట, కాల్చిన మక్క కంకులు కొనుగోలు చేస్తున్నారు. ఆర్మూర్ ప్రాంతంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పండించిన మొక్కజొన్న పంటను దళారులు ముందుగానే కొనుగోలు చేస్తారు. కొందరు రైతులు నేరుగా ఆటో ట్రాలీల్లో పచ్చి మక్కెన్‌లను అంకాపూర్ మార్గెట్‌కు తరలించి రోడ్డు పక్కన కుప్పలుగా పోసి అమ్మకాలు సాగిస్తుంటారు. ఎకరం భూమిలో తొమ్మిది నుంచి పది ఆటో ట్రాలీల పచ్చిబుట్ట పండుతుంది. కంకుల సైజును బట్టి మధ్య దళారులు రైతులకు ధర చెల్లించి ట్రాలీ చొప్పున కొనుగోలు చేస్తున్నారు.

పచ్చిబుట్ట అమ్ముతున్నారు



వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతులు పచ్చి బుట్టను అమ్మడానికే ఆసక్తి చూపుతున్నారు. పంటను మార్కెట్‌కు తరలించి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రారంభంలో మూడు వేల రూపాయలు పలికిన ఆటో ట్రాలీ మక్కెన్‌ల ధర ఇప్పుడు పది వేల రూపాయలకు చేరింది.

– ఎర్రన్న, పచ్చిబుట్టల వ్యాపారి, అంకాపూర్

కంకులకు గిరాకీ పెరిగింది



వాతావరణం చల్లబడటంతో కాల్చిన మక్కెన్‌లు తినడానికి ప్రజలు ఇష్టపడుతారు. మక్క వడలు సైతం ఇష్టంగా తింటారు. దీంతో పచ్చిబుట్టకు డిమాండ్ పెరిగింది. చాలా మంది గ్రామానికి వచ్చి పచ్చిబుట్టలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్ పుంజుకుంటోంది.

– శ్రీనివాస్, పచ్చిబుట్టల వ్యాపారి, అంకాపూర్

సంబురాలు ఎందుకు?



- రైతులను మోసం చేసినందుకా!
- సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతోందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రైతులు సంబురాలు ఎందుకు జరుపుకోవాలని ఆయన ప్రశ్నించారు. రైతు సంక్షేమం గురించి కాంగ్రెస్ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన విద్యుత్, 100 శాతం ధాన్యం కొనుగోలు, రెండు సార్లు రూ.28 వేల కోట్ల రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ రైతులను ఓటు బ్యాంకుగా చూస్తోందని, కేసీఆర్ మాత్రం రైతు సంక్షేమం తన బాధ్యతగా పాటించారన్నారు.

■ ప్రభుత్వ వైఖరి కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుందన్నారు. డిసెంబర్ 9 నాడు చేయాల్సిన రూ.2 లక్షల రుణమాఫీని 7 నెలలు ఆలస్యంగా.. అది కూడా కొందరికే చేశారన్నారు. వానాకాలం సీజన్‌కు రైతు భరోసా కింద ఇవ్వాల్సిన రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి ఆ డబ్బుల్లోంచే రుణమాఫీ కింద రూ.6,098 కోట్లు విదిల్చి, తామేదో ఘనకార్యం చేసినట్లు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ మోసానికి రైతులు సంబురాలు చేసుకోవాలా అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. రూ.31 వేల కోట్లు ఒకేసారి రుణమాఫీ అని ప్రకటనలు ఇచ్చి చేసింది కేవలం రూ.6 వేల కోట్లు మాత్రమేనన్నారు.

■ ఉమ్మడి జిల్లాలో కేసీఆర్ ప్రభుత్వం 2016లో మొదటి సారి రూ.లక్ష లోపు రుణాలు ఉన్న 3,79,520 మంది రైతులకు రూ.1,576 కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. 2018లో రెండోసారి రూ.లక్షలోపు రుణాలు ఉన్న 1,95,657 మంది రైతులకు రూ.942 కోట్ల మాఫీ చేశామన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 94,566 మంది రైతులకు రూ.459 కోట్లు మాత్రమే మాఫీ చేసిందన్నారు.

■ సీజన్‌కు రూ.7,500 కోట్లు పెట్టుబడి సాయంగా రూ.72వేల కోట్లు, రెండు సార్లు రుణమాఫీకి రూ.28వేల కోట్లు ఇలా మొత్తంగా రూ.లక్ష కోట్లకు పైగా నేరుగా రైతుల ఖాతాల్లో కేసీఆర్ ప్రభుత్వం జమ చేసిందన్నారు. కాంగ్రెస్ మా త్రం రైతు భరోసాకు ఎగనామం పెట్టేందుకు కమిటీ పేరిట కాలయాపన చేస్తోందని విమర్శించారు. రైతు భరోసా ఎకరానికి రూ.7,500 చొ ప్పున వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోపు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



మోర్తాడ్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మోర్తాడ్: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. మోర్తాడ్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రి, గాండ్లపేట్‌లోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాల్లో మార్పు ఖచ్చితంగా కనిపించాలని ఆదేశించారు. ఆస్పత్రిలోని లేబోరేటరీ, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషంట్ వార్డు, ఆక్సిజన్ ప్లాంట్, వ్యాక్సినేషన్ గదిని పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాండ్లపేట్ పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. డీఈవో దుర్గాప్రసాద్, డీసీహెచ్ఎస్ శివశంకర్, మోర్తాడ్ మండల ప్రత్యేకాధికారి మధుసూదన్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో తిరుమల, నాయకులు మైత్రీ, గిర్మాజి గంగాధర్, గిర్మాజి గోపి పాల్గొన్నారు.

పది రోజుల్లో రెండో విడత రుణమాఫీ

- విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దండి
- బోధన్ షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం
- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): ఇచ్చిన మాటకు కట్టుబడి పది రోజుల్లో రెండో విడత రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాటాపూర్‌లో శుక్రవారం అధికారులు, పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ చక్కర ఫ్యాక్టరీని త్వరలో తెరిపిస్తామని హామీ ఇచ్చారు. నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీరందకపోవడంతో గోదావరి, మంజీర నదులపై ఎత్తిపోతల పథకాలను నిర్మించినట్లు వివరించారు. త్వరలో డీఎస్సీని పూర్తి చేసి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని వెల్లడించారు. లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. పా ఠశాలల్లో సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉత్తమ ఫలితాలను తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. పాఠశాలల్లో రాత్రి సమయంలో మద్యం తాగుతున్నట్లు పలువురు ఆయన దృష్టికి తీసుకరాగా అక్కడే ఉన్న బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌తో మాట్లాడి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మొబిన్‌ఖాన్, నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, సాయిబాబాగౌడ్, రమేశ్‌కుమార్, సాయారెడ్డి, రాములు, మోహన్, గయాస్, కార్తీక్, పోచయ్య, కృష్ణ, కిరణ్, గంగాధర్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్, పీజీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. క్యాంపస్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని తెయూ ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. ఉదయం జరిగిన పరీక్షలకు 14 మంది విద్యార్థులకు అందరు హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 89 మంది విద్యార్థులకు 81 మంది పరీక్ష రాశారని ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు.

ఇద్దరు డీటీఎఫ్ నాయకులకు నోటీసులు

నిజామాబాద్ అర్బన్: డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ప్రధాన కార్యదర్శి ఓమాజీలకు శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 1న పాఠశాల పనిదినాల్లో వీరు అనారోగ్య సమస్యల పేరిట సెలవు తీసుకొని పాఠశాల డైరెక్టరేట్‌కు వెళ్లిన ఘటనపై నాటి విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఆగ్రహం వ్యక్తం చేయడంతో నోటీసులు ఇచ్చారు. వివరాలు.. బాలయ్య సిరికొండ మండలం రావుట్ల ఉన్నత పాఠశాలలో, ఓమాజీ నందిపేట మండలం వెల్మల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు. వీరు ఈ నెల ఒకటో తేదీన రాష్ట్ర నాయకుడు శంతన్‌తో కలిసి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనను కలిశారు. డీఈవో దుర్గాప్రసాద్ పదోన్నతులలో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన కమిషనర్ పనిదినాలలో ఇక్కడికి రావడానికి ఎలాంటి అనుమతి తీసుకున్నారని ప్రశ్నించారు. బాలయ్య, ఓమాజీలు అనారోగ్య కారణాలను చూపుతూ సెలవు పెట్టారు. అనారోగ్య కారణాలు చూపుతూ డైరెక్టరేట్‌కు రావడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆమె ఆదేశించారు. దీంతో ఓమాజీ, బాలయ్యలకు నోటీసులు జారీ చేశారు. కాగా పదోన్నతుల్లో డీఈవో అక్రమాలకు పాల్పడ్డట్లు వీరు ఇటీవల రాష్ట్ర నాయకుడు శంతన్‌తో కలిసి ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో తనపై అనవసర ఆరోపణలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తనకు ఏమైనా అయితే డీటీఎఫ్ నాయకులదే బాధ్యత అంటూ డీఈవో బహిరంగ ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే.

నేడు మున్సిపల్ కమిషనర్‌తో సాక్షి ఫోన్ ఇన్

డెంగీ, మలేరియా తదితర వ్యాధుల సీజన్ నేపథ్యంలో 'సాక్షి' ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ఎ. రాజుతో ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. డంపర్‌బిన్‌లు, రహదారులు, ఖాళీ స్థలాల పారిశుధ్యంతో పాటు వివిధ సమస్యలపై ప్రజలు అడగవచ్చు.

తేది : 20-07-2024 (శనివారం)

సమయం: ఉదయం 11:00 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98499 04276



రాజు, మున్సిపల్ కమిషనర్,ఆర్మూర్

జిల్లాలో విస్తారంగా వర్షం

- 27.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి విస్తారంగా వర్షం కురిసింది. 27.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా రుద్రూర్‌లో 68.0 మిల్లీమీటర్లు, కోటగిరిలో 66.9 మి.మీ. వర్షం కురిసింది. నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో జిల్లాలో వరినాట్లు ఊపందుకున్నాయి. చెరువులు, ప్రాజెక్టుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతుండగా, వాగులు, వంకలు పారుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు 14 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 15 మండలాల్లో సాధారణ, 4 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. వాయుగుండం ప్రభావంతో మరో రెండ్రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం ప్రకటించింది.



జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.లో)	మండలం	వర్షపాతం (మి.మీ.లో)	మండలం	వర్షపాతం (మి.మీ.లో)
రుద్రూర్	68.0	మోస్రా	28.1	మెండోరా	21.6
కోటగిరి	66.9	వేల్పూర్	26.9	ఏర్గట్ల	21.0
వర్ని	53.5	రెంజల్	26.5	సిరికొండ	20.6
చందూర్	52.9	భీమ్‌గల్	25.6	జక్రాన్‌పల్లి	19.4
నవీపేట్	42.4	మోపాల్	25.5	ఎడపల్లి	19.2
పోతంగల్	41.5	బోధన్	25.0	నిజామాబాద్ నార్త్	17.9
మోర్తాడ్	35.8	ముప్కాల్	24.6	ఇందల్వాయి	17.8
బాల్కొండ	28.5	మాక్లూర్	23.1	ధర్పల్లి	17.2
		ఆలూరు	22.7	నందిపేట్	16.6
		సాలూర	21.8	నిజామాబాద్ సౌత్	16.0

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.



సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.



సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ ప్రథమశ్రేణి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎండీ రహీమొద్దీన్, ఆర్మూర్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా జి రామకృష్ణ, కామారెడ్డి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కృష్ణవేణి నియామకమైనట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

హోటల్ నిర్వాహకులకు జరిమానా



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పలు హోటళ్లను మున్సిపల్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టి నిర్వాహకులకు జరిమానా విధించారు. తనిఖీల్లో వంటగది పరిశుభ్రంగా లేని కావ్యమెస్, త్రిశక్తి బార్ అండ్ రెస్టారెంట్ హోటల్ నిర్వాహకులకు రూ. పదివేల జరిమానా విధించినట్లు శానిటరీ ఎస్సై మహేశ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి హోటల్ నిర్వాహకులు వంటగదిని శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, సిబ్బంది వెంకటేశ్, బాబురావు, రవి తదితరులు ఉన్నారు.

విత్తనోత్పత్తి సజావుగా చేపట్టాలి

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



నిజామాబాద్ రూరల్: ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన విత్తనోత్పత్తి సజావుగా చేపట్టి రైతులకు సజావుగా పంపిణీ అయ్యేలా చూడాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. జిల్లాలోని సారంగపూర్, ఆర్మూర్ విత్తనాభివృద్ధి సంస్థ, కార్యాలయాలను శుక్రవారం సందర్శించారు. జిల్లా రైతులకు కావాల్సిన విత్తనాలు సంస్థ ద్వారా ఎంత వరకు పంపిణీ అయిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. అనంతరం యాసంగి 2024–25 సీజన్‌కు సంబంధించిన విత్తనోత్పత్తి సీడ్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తర్వాత రైతులు, సంస్థ ఉద్యోగులతో కలిసి గోదాములు, విత్తనశుద్ధి కర్మాగారాలను సందర్శించారు. ఆయన వెంట కె. విష్ణువర్ధన్ రెడ్డి, రీజినల్ మేనేజర్, ఉద్యోగులు, కార్మికులు ఉన్నారు.

బషీరాబాద్‌లో బాధితులు

- వలస కార్మికులను నట్టేట ముంచిన హుండీ వ్యాపారి
- కుటుంబ సభ్యులు సైతం పరారు కావడంతో లబోదిబోమంటున్న బాధితులు



మోర్తాడ్: సౌదీ అరేబియాలో ఉన్న తెలంగాణ వలస కార్మికుల నుంచి డబ్బులు తీసుకుని హుండీ విధానంలో చెల్లిస్తానని నమ్మించి ఉడాయించిన మోసకారి కోసం బాధితులు కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ చుట్టూ తిరుగుతున్నారు. బషీరాబాద్ కు చెందిన ఓ వ్యక్తి కొన్నేళ్లుగా సౌదీలోని రియాద్‌లో ఓ కంపెనీలో పని చేస్తూ తాను హుండీ దందా చేస్తున్నట్లు అందరిని నమ్మించాడు. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, జగిత్యాల్, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు చెందిన వలస కార్మికుల నుంచి దాదాపు రూ.3.80 కోట్లు వసూలు చేశాడు. హుండీ పద్ధతిలో వలస కార్మికుల ఇండ్లకు వెళ్లి వారు అందించిన నగదును అప్పగిస్తానని కమీషన్ తక్కువ తీసుకోవడమే కాకుండా సౌదీ రియాల్‌కు ఇంకా కొంత ఎక్కువ ధర చెల్లిస్తానని అందరినీ నమ్మించాడు. సౌదీలో కంపెనీ వీసా లేకుండా ఖలివెల్లి చేస్తున్నవారు హుండీ పద్ధతిలో డబ్బులు పంపించడానికి బషీరాబాద్‌కు చెందిన వ్యక్తిని ఆశ్రయించేవారు. ఇలా కొన్ని నెలల పాటు హుండీ వ్యాపారం సజావుగానే సాగిన సదరు వ్యక్తి ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బులు జమ కాగానే తన అసలు రూపం బయటపడింది. సౌదీ అరేబియా నుంచి ఇంటికి వెళ్తున్నాని చెప్పి ఎయిర్‌పోర్టు నుంచి మాయమయ్యాడు. ముందస్తుగానే బషీరాబాద్‌లో ఉన్న అతని భార్య, కొడుకులు, తల్లి, తండ్రిని రహస్య ప్రాంతానికి తరలించాడు. తాము మోసపోయినట్లు గుర్తించిన వలస కార్మికులు ఈ సమాచారాన్ని కుటుంబీకులు, బంధువులకు తెలియజేయడంతో అందరూ బషీరాబాద్‌కు వచ్చి మోసగించిన వ్యక్తి, కుటుంబం సభ్యుల గురించి ఆరా తీస్తున్నారు.

బ్యాంకులోని బంగారం డ్రా..

కార్మికులను మోసం చేసిన సదరు వ్యక్తి తన మోసం బయటపడక ముందే అనేక జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. బషీరాబాద్‌లోని గ్రామీణ బ్యాంకులో తనాఖా ఉంచి బంగారానికి పది రోజుల ముందుగానే నగదు చెల్లించి ఆ బంగారం డ్రా చేసుకున్నారని తెలుస్తోంది. బషీరాబాద్ పరిసర గ్రామాల్లో వారికి రావాల్సిన డబ్బును వసూలు చేసుకోవడం, ఎవరికి హుండీ సొమ్ము చెల్లించకుండా ఉండటం పరిశీలిస్తుంటే అందరిని మోసగించాలని ముందస్తు ప్రణాళికను ముందే సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా బషీరాబాద్‌లోని సదరు వ్యక్తి ఇంటికి తాళం వేసి ఉండటంతో అందులో ఏమైనా సామాగ్రి ఉందా లేదా అని తెలుసుకోవడం ఎలా అని బాధితులు సందిగ్ధంలో ఉన్నారు. హుండీ వ్యాపారి మోసం బయటపడటంతో బాధితులు అంతా తమకు ఏమైనా న్యాయం జరుగుతుందా అనే ఆశతో బషీరాబాద్‌కు వచ్చి ఇక్కడ స్థానికులతో తమ గోడు వెల్లబోసుకుంటున్నారు.

అదును చూసి.. పసుపు లారీ హైజాక్



హైజాక్‌కు గురైన లారీ



షటర్ రూమ్‌లో ఉంచిన పసుపు

- డ్రైవర్‌కు మత్తు మందు ఇచ్చి లారీతో పరారైన దుండగులు
- నవీపేటలో లారీ, రూ. 50 లక్షల పసుపు పట్టివేత

ఖలీల్‌వాడి/ నవీపేట: కొద్ది కాలంలోనే డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో కొందరు అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. కొందరు ఏ లారీల్లో ఏ సామాగ్రి, ఏ పంట వెళ్తుందో తెలుసుకొని వాటిపై నిఘా పెంచుతున్నారు. అదును చూసి పక్కా ప్రణాళిక ప్రకారం వాటిపై దాడి చేస్తున్నారు. కానీ చివరికి పోలీసులకు చిక్కి కటాకటాల పాలవుతున్నారు. ఇలాంటి ఘటనకు సంబంధించి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. జిల్లా కేంద్రం నుంచి ఈ నెల 17న పసుపులోడ్‌తో బయలుదేరిన లారీ గుంటూరుకు చేరుకోవాల్సి ఉండగా ఇందల్వాయి టోల్‌ప్లాజా సమీపంలో ఓ కారులో వచ్చిన దుండగులు ఆర్టీఏ అధికారులమంటు లారీని నిలిపివేశారు. దీంతో డ్రైవర్ రమేశ్ వెంటనే లారీ యజమాని వెంకటేశ్వర్లుకు ఫోన్‌లో సమాచారం అందించాడు. డ్రైవర్‌కు వారు మత్తుమందు ఇవ్వడంతో స్పృహ కోల్పోయాడు. వెంటనే లారీతో పరారీ అయ్యారు. ఇందల్వాయి మీదుగా గాంధారి ఎక్స్ రోడ్డు వరకు చేరుకున్న వారు లారీకి ఉన్న జీపీఎస్‌ను తొలగించారు. నిందితులు తిరిగి ఈ లారీని అదే రోజు రాత్రి నవీపేట్‌లోని జన్నేపల్లి గ్రామానికి తరలించారు. నిర్మానుష ప్రాంతంలో ఉంచి లారీలో ఉన్న పసుపును ఆటో ట్రాలీల ద్వారా నిజామాబాద్ మార్కెట్‌కు ఈ నెల 18న గురువారం తీసుకొచ్చి విక్రయించారు. ఇలా జన్నేపల్లిలో ఉన్న లారీ నుంచి నాలుగు ట్రాలీ ఆటోల్లో 50 కిలోల చొప్పున ఉన్న పసుపు బస్తాలను నింపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని డ్రైవర్‌ను, లారీని పట్టుకున్నారు. ఇందులో ప్రధాన నిందితులైన నవీపేటకు చెందిన సాదుల్లా, సోఫీలు పరారయ్యారు. కాగా సదరు నిందితులు 70 శాతం పసుపును అమ్మేశారు. మిగిలిన పసుపును జన్నేపల్లిలోని ఓ షెటర్ రూమ్‌లో 120 బస్తాలను నిల్వ చేశారు. లారీలో 30 టన్నుల పసుపు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీని విలువ రూ. 50 లక్షలు ఉండగా 12 టైర్ల లారీ రూ. 40 లక్షల వరకు ఉంటుందని పోలీసులు పేర్కొంటున్నారు. పసుపును తరలించిన ట్రాలీ ఆటోలను నవీపేట్ పీఎస్‌కు తరలించారు. లారీని పోలీసులు పట్టుకోవడంతో లారీ యజమాని వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగరంలోని ఒకటో టౌన్ పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

జిల్లా కేంద్రంలోనే మకాం..

పసుపు లారీని హైజాక్ చేసిన ప్రధాన నిందితులు నిజామాబాద్‌లో కుటుంబీకులతో నివసిస్తున్నారు. సాదుల్లా నవీపేట్‌లో, అదే మండలంలోని జన్నేపల్లిలో ఇనుప సామాను కొనుగోలు దుకాణాలు ఉన్నాయి. జిల్లా కేంద్రం నుంచి వీరు షాపులకు వెళ్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు

- బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): హాస్టల్స్ విద్యార్థులకు అందించే అల్పాహారం, భోజనంలో బల్లి, కీటకాలు, పురుగులు రావడం లాంటి ఘటనలు మరోసారి జరిగితే వంట మనుషులు, హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి హెచ్చరించారు. గురువారం రాత్రి గర్ల్స్ హాస్టల్ విద్యార్థినులు తినే భోజనంలో పురుగు, గత నెల 21న అల్పాహారంలో బల్లి వచ్చిన విషయం తెలిసిందే. ఇలా గర్ల్స్ హాస్టల్ మెస్‌లో జరుగుతున్న వరుస ఘటనలను తీవ్రంగా పరిగణించిన రిజిస్ట్రార్ శుక్రవారం ఉదయం 6 గంటలకే హాస్టల్‌కు చేరుకున్నారు. సుమారు మూడు గంటల పాటు హాస్టల్ మెస్ హాల్, వంట గది, పరిసరాలను పరిశీలించారు. ఆహారంలో కీటకాలు రావడానికి గల కారణాలపై సిబ్బంది, విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు. అనంతరం వంట మనుషులు, మెస్ సిబ్బందితో రిజిస్ట్రార్ ప్రత్యేకంగా సమీక్షించారు. విద్యార్థినులు అల్పాహారం చేసేంత వరకు హాస్టల్‌లోనే ఉండి తర్వాత పరిపాలనా భవనం చేరుకున్నారు.



సిబ్బందిని విచారిస్తున్న ఎంక్వైరీ కమిటీ సభ్యులు

విచారణ కమిటీ ఏర్పాటు..

గర్ల్స్ హాస్టల్ భోజనంలో పురుగు వచ్చిన ఘటనపై తెయూ ఇన్‌చార్జీ వీసీ సందీప్ సుల్తానియా ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె అపర్ణ, హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఎ మహేందర్‌రెడ్డి హాస్టల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. మెస్ సిబ్బంది, వంట మనుషులు, విద్యార్థినులతో మాట్లాడి వివరాలు నమోదు చేశారు. సాయంత్రం రిజిస్ట్రార్‌కు నివేదిక అందజేశారు. క్యాంపస్ హాస్టల్స్‌లో కంప్లయింట్ బాక్స్‌లు ఏర్పాటు చేసి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రిజిస్ట్రార్ ఆదేశించారు.

జీపీ, ఏజీపీల నియామకం



వెంకటరమణ



రాజు

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో జిల్లా అధికార యంత్రాంగం కోసం తాత్కాలిక న్యాయాధికారులను నియమిస్తూ కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర న్యాయమంత్రిత్వశాఖ కార్యదర్శి ఉత్తర్వుల మేరకు గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది వెంకట రమణాగౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పెండెం రాజు నియామకమయ్యారు. రమణాగౌడ్ నిజామాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో జిల్లా అధికార యంత్రాంగం తరపున సివిల్ దావాలలో న్యాయ వ్యవహారాలు, రాజు నిజామాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జిల్లా అధికార యంత్రాంగం తరపున సివిల్ కేసులలో న్యాయ వ్యవహారాలు నిర్వహిస్తారు. వీరికి నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా జడ్జిని కలిసిన జీపీ, ఏజీపీలు

గవర్నమెంట్ ప్లీడర్‌గా, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియామకమైన వెంకటరమణాగౌడ్, రాజు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాలను మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియామకాల గురించి జడ్జికి వివరించారు. అనంతరం జడ్జి ఇరువురికి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్రంలో రైతు ప్రభుత్వం ఏర్పడింది

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఆర్మూర్: రాష్ట్రంలో రైతు ప్రభుత్వం నడుస్తోందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ సంబురాల్లో భాగంగా శుక్రవారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల కోరినట్లుగా అంకాపూర్ దేశి చికెన్ తినిపిస్తారా అంటూ సుదర్శన్‌రెడ్డి రైతులని అడిగారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అభివృద్ధిపై పాలకవర్గం, అధికారులతో చర్చించారు. సమవేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ షేక్ మున్ను, నాయకులు మారచంద్రమోహన్, సాయిబాబా గౌడ్, మోత్కూరి లింగా గౌడ్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్లను సన్మానిస్తున్న నాయకులు

రైతులు ధైర్యంగా ఉండాలి

భీమ్‌గల్: రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ గా ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్ రెడ్డి, విత్తనాభివృద్ధి చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్ బిన్ హందాన్ కార్పొరేషన్ చైర్మన్లుగా నియామకం కావడంతో నియోజకవర్గ నాయకులు పట్టణ కేంద్రంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు మాట్లాడారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఎంతో అభివృద్ధి చేస్తే, బీజేపీ దేశాన్ని అడుగునకు తొక్కేస్తుందని విమర్శించారు. రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, వెంకటేశ్ గౌడ్, ముత్యం రెడ్డి, గంగాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన వరద

బాల్కొండ: ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్ట్‌లోకి క్రితం రోజు 26వేల క్యూసెక్కులు వచ్చిన వరద శుక్రవారం ఉదయానికి 21 వేల క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 234, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1065.60(16.84 టీఎంసీలు)అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

117వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
బ్యాంక్ ఆఫ్ బరోడా - దేవిరోడ్ శాఖ , నిజామాబాద్
ఖాతాదారులకు, వ్యాపారస్తులకు, సంస్థలకు, అత్యున్నతమైన సేవలందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మరియు బ్యాంక్ సిబ్బందికి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు. అభినందనలతో...
కె. కరణ్‌రెడ్డి, L. జయశ్రీ W/o. L. ప్రభాకర్ రెడ్డి
రాజరాజేశ్వర ఐరన్ మర్చంట్
Near నీలకంఠేశ్వర టెంపుల్, కంఠేశ్వర్ కాంప్లెక్స్, నిజామాబాద్
98488 22572, 93969 55802



శ్రీ పెంచాల శ్రీనివాస్ మేనేజర్

117వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
బ్యాంక్ ఆఫ్ బరోడా - దేవిరోడ్ శాఖ , నిజామాబాద్
ఖాతాదారులకు, వ్యాపారస్తులకు, సంస్థలకు, అత్యున్నతమైన సేవలందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మరియు బ్యాంక్ సిబ్బందికి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.
అభినందనలతో...
తుల్జ భవాని వైన్స్ - దూస్‌గాం



శ్రీ పెంచాల శ్రీనివాస్ మేనేజర్



వి. శ్రీనివాస్ స్వామి నిజామాబాద్

క్రైం కార్నర్

చెరువులో పడి మహిళ ఆత్మహత్య



సాయవ్వ(ఫైల్)

పిట్లం: మండల కేంద్రంలోని ఊర చెరువులో పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలోని బీబీపేటకు చెందిన సాయవ్వ(51) పిట్లం ఊర చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యం



బాదావత్ రాజు

నిజామాబాద్ రూరల్: మండలంలోని చక్రధర్‌నగర్ తండాకు చెందిన బాదావత్ రాజు అనే యువకుడు అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇంటి నుంచి ఈనెల 7న బయటకు వెళ్లిన రాజు తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. రాజు తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో చోరీ



లింగంపేట:మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి భవనంపై నుంచి లోపలికి ప్రవేశించి కార్యాలయ గది తాళాన్ని పగులగొట్టారు. గదిలో ఉన్న రెండు సీపీయూలు, ప్రింటర్, మానిటర్, కీబోర్డులను అపహరించినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో నరేశ్ ఫిర్యాదు మేరకు కార్యాలయాన్ని సందర్శించి వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

ఖలీల్‌వాడి: నగరంలోని దేవీ టాకీస్ ప్రాంతంలోని ఓ టీచర్ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై పాండేరావు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన శ్రీనివాస్ తన ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన రూ. 4 లక్షల నగదును బీరువాలో పెట్టారు. భార్య అంగన్‌వాడీ టీచర్ కావడంతో ఉదయం ఆమె సెంటర్‌కు వెళ్లగానే ఇంట్లో ఉన్న శ్రీనివాస్ తన తల్లిని తీసుకొని పనినిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. దుండగులు ఈ విషయాన్ని గ్రహించి ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉన్న వస్తువులను పడేసి రూ. నాలుగు లక్షల నగదును దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిట్టాపూర్‌లో..



బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన పుంచెట్టి లింగన్న ఇంట్లో శుక్రవారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై యాసర్ అర్ఫాత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లింగన్న కుటుంబ సభ్యులు ఉదయం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చిన లింగన్నకు ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో గమనించి ఇంట్లోకి వెళ్లి పరిశీలించాడు. చోరీ జరిగినట్లు పోలీసులకు సమాచారం అందించాడు. బీరువాలో ఉన్న 8.5 తులాల బంగారు ఆభరణాలు, రూ. 50 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోకు మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ మల్లారెడ్డి శుక్రవారం మెమో జారీ చేశారు. సాక్షి దినపత్రికలో 'ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వోపై' ఫిర్యాదు అనే శీర్షికకు శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కల్లు దుకాణాలపై విచారణ చేపట్టి రిపోర్టు అందించాలని ఎక్సైజ్ ఈఎస్ మల్లారెడ్డి మెమో అందజేశారు. నగరంలోని మూడో కల్లు డిపోలో ఉన్న కల్లుబట్టిలు ఒక చోట ఉండాల్సినవి మరో చోట ఏర్పాటు చేశారని దీనిపై రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్‌కు మెయిల్‌లో ఫిర్యాదులు చేశారు. ఈ దుకాణాలు జనవాసాల కొనసాగుతున్నా ఎస్‌హెచ్‌వో దిలీప్ పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పలువురు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కల్లుడిపోను మూసివేశారు. కల్లు దుకాణం ఏర్పాటులో ఎస్‌హెచ్‌వో సహకారం ఉందనే ఆరోపణలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. ఈ విషయమై ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డిని వివరణ కోరగా ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు మోమో అందించామని, కల్లుదుకాణాలపై విచారణ చేపట్టి రిపోర్ట్ అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

లైబ్రరీ రీడింగ్ రూం స్విచ్ బోర్డులో మంటలు



స్విచ్ బోర్డులో వస్తున్న మంటలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ రీడింగ్ రూంలో శుక్రవారం ఉదయం స్విచ్ బోర్డులో మంటలు చెలరేగాయి. స్విచ్ బోర్డు నుంచి పెద్దగా మంటలు రావడంతో అక్కడే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన లైబ్రరీ సిబ్బంది వెంటనే మెయిన్ స్విచ్ నిలిపివేశారు. దీంతో మంటలు నిలిచిపోయాయి. లైబ్రేరియన్ సత్యనారాయణ వర్సిటీ ఎలక్ట్రీషియన్ నాగరాజుకు సమాచారం ఇవ్వడంతో బోర్డును పరిశీలించాడు. స్విచ్ బోర్డులోకి కీటకం దూరడంతో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చినట్లు గుర్తించారు. కాలిపోయిన స్విచ్‌బోర్డుకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం మెయిన్ బోర్డును ప్రారంభించడంతో విద్యార్థులు తిరిగి తమ సన్నద్ధత కొనసాగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■ నిజామాబాద్ వినాయక్‌నగర్‌లో ఐశ్వర్య బోటిక్ నందు పనిచేయుటకు అనుభవం గల లేడీ టైలర్ కావలెను. ఆకర్షణీయమైన వేతనం కలదు. Cell: 7702557561. [Z-795573]
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యా భర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14404]
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



రవి మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్: కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని అన్నాసాగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొనగండ్ల రవి(32) తన పంట పొలంలో నాటు వేసేందుకు వెళ్లగా నారు గంపను నెత్తిన పెట్టుకుని వస్తున్న సమయంలో కిందికి వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. గమనించిన పొలంలోని రైతులు ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని చివరికి తమ కుటుంబ పెద్దను కోల్పోవాల్సి వచ్చిందని కుటుంబీకులు బోరున విలపించారు. రవి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు విన్నవించారు. విచారణ చేపట్టి నివేదిక పంపాలని ఆర్డీవో ప్రభాకర్‌ను కలెక్టర్ ఆదేశించారు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: వినాయక్‌నగర్ ప్రాంతంలో జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ నరహరి శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వినాయక్‌నగర్‌లో బుధవారం ఉదయం మురళి హోటల్ ముందు జరిగిన హత్య కేసులో నిందితుడు సాయి కుమార్‌ను అమ్మ వెంచర్ ప్రాంతంలో పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. వంశీ వినాయక లిక్కర్ మార్ట్‌లో నిందితుడు సాయికుమార్, మృతుడు ఆనంద్ బిహారి పాండే రాత్రి మద్యం తాగారు. మూత్రవిసర్జనకు వెళ్తున్న సాయికుమార్‌ను మద్యం మత్తులో ఆనంద్ వెనుక నుంచి నెట్టివేశాడు. దీంతో వీరి మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. అనంతరం అక్కడి నుంచి బయటకి వచ్చిన వీరు తిరిగి ఇదే విషయంలో అర్ధరాత్రి రోడ్డుపై గొడవ పడ్డారు. సాయికుమార్ ఆనంద్‌ను గొంతుపట్టి నెట్టివేయడంతో కిందపడిపోయాడు. అక్కడున్న బండరాయితో తలపై మోదాడంతో మృతి చెందాడు. కేసును ఛేదించడంలో ఎస్‌హెచ్‌వో పాండేరావు, ఏఎస్సై సాయిలు, సిబ్బంది మనోజ్, అనిల్, బాలాజీ, భూరాజ్, సంగేస్, నారాయణ, రవి రమేశ్, రాకేశ్ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని పెద్దబజార్‌లో ఉన్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్‌పై చీటింగ్ ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు సీఐ నరహరి తెలిపారు. అజయ్ బ్యాంకు మేనేజర్‌గా 2022 నుంచి 2024 జూలై5 వరకు పనిచేసినట్లు చెప్పారు. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారుల నుంచి చీటింగ్, ఫోర్జరీలు చేసి రూ.88.80 లక్షల నగదును వాడుకున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

ఖలీల్‌వాడి: నగరంలోని పలు లాడ్జీల్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. లాడ్జీల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరగకుండా ఉండేందుకు సీసీఎస్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఉమెన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరహరి, నాలుగో టౌన్ ఎస్‌హెచ్‌వో పాండేరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చావాలని వచ్చి.. మనసు అంగీకరించక..

- కుటుంబ కలహాలతో వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం
- గోదావరిలో కూర్చోగా కాపాడిన పోలీసులు



వృద్ధురాలిని ఒడ్డుకు తీసుకొస్తున్న జాలర్లు

రెంజల్: గోదావరి నదిలో చావాలని వచ్చిన ఓ వృద్ధురాలు మనసు అంగీకరించక నీటిలో ఉండటంతో పోలీసులు సురక్షితంగా కాపాడారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు ధర్మాబాద్ తాలూకా యాతాళంకు చెందిన వృద్ధురాలు కుటుంబ కలహాలతో గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చింది. కందకుర్తి వద్ద గోదావరి నదిలో సగం నీటిలో మునిగి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు రెంజల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయన్న ఆదేశాల మేరకు కందకుర్తికి వెళ్లిన పోలీసులు నదిలో వృద్ధురాలు ఉన్నట్లు గుర్తించారు. నది మధ్యలో మహారాష్ట్ర భూభాగంలో ఉన్నట్లు గుర్తించిన స్థానిక పోలీసులు ధర్మాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఆటోతో పాటు అక్కడి జాలర్లను తీసుకొచ్చి గోదావరి నదిలోకి పంపారు. వృద్ధురాలు సగం వరకు నీటిలో మునిగి ఉండటంతో జాలర్లు ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ధర్మాబాద్ పోలీసులు వృద్ధురాలి వివరాలను సేకరించి కుటుంబీకులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించారు.